క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

పూడూరు: బీఆర్ఎస్ పార్టీ పూడూరు మండల కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు మండల పరిధి హరీశ్వర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో సమీక్ష జరగనుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. కావున మండల పరిధి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

తాండూరు రూరల్: తాండూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అనితగౌడ్ అధ్యక్షతన మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సమీక్ష జరగనుందని తెలిపారు. సర్పంచు, ఎంపీటీసీలతో పాటు వివిధ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. నేడు జరగనున్న సమావేశం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి మొదటిది కాగా.. సర్పంచులకు చివరిది కానుంది. సర్పంచుల పదవి కాలం ఈ నెల ఆఖరుతో ముగియనుండటంతో ఇదే వారికి ఆఖరి సమావేశం అవనుంది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొడంగల్ రూరల్: మండల పరిధి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. కొడంగల్‌తో పాటు హస్నాబాద్, పెద్దనందిగామ గ్రామాలకు చెందిన అర్హులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్, సంజీవరెడ్డి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

22న రామయజ్ఞం

కుల్కచర్ల: అయోధ్య బాల రాముడు ఆలయ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ నెల 22న కుల్కచర్ల మండలం పుట్టపహాడ్ గ్రామం శ్రీ సీతారాముల ఆలయంలో రామయజ్ఞం నిర్వహించనున్నట్లు పతంజలి రమేశ్‌చార్యులు తెలిపారు. రామయజ్ఞంతో పాటు, శ్రీరామ పట్టాభిషేకం, కరసేవకులకు సన్మానం చేయనున్నట్లు వెల్లడించారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో పీఆర్‌టీయూ సంఘం 2014 క్యాలెండర్‌ను శుక్రవారం తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు భీమప్ప మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం ఎంతో కృషి చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెంట్యానాయక్, హెచ్ఎం ఊషన్న, రాజు, వెంకట్‌స్వామ ఉన్నారు.

పాఠశాల 'ప్రతిభ'కు చేయూత



దాత ప్రతిభను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధి పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల సుందరీకరణకు ప్రతిభ ముందుకు రావడం హర్షణీయమని హెచ్ఎం క్రాంతికుమార్ కొనియాడారు. పాఠశాల భవన అభివృద్ధికి చేయూత నందించిన ఆమెను ఈ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయం

అనంతగిరి: వికారాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1,10,12 వార్డుల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యల గురించి స్థానికులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇక్కడి సమస్యలను స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కౌన్సిలర్లు వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రెడ్యా నాయక్, ప్రదీప్ సందీప్‌గుప్తా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాథమిక హక్కు

కొనసాగనున్న నమోదు ప్రక్రియ

- అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- బీఎల్‌ఓలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- సమీక్ష సమావేశాల్లో తహసీల్దార్లు



కుల్కచర్ల: ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రభు

కుల్కచర్ల: ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు, అది ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కు అని తహసీల్దార్ ప్రభులు అన్నారు. శుక్రవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లేవల్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఇందుకు శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రక్రియ గురించి ప్రచారం చేసి, అర్హులందరూ సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో గిర్దవరి వెంకటగిరి, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరో అవకాశం

ధారూరు: మండల పరిధి పోలింగ్ కేంద్రాల్లో నూతన ఓటరు నమోదు ప్రక్రియను శని, ఆదివారాల్లో చేపట్టనున్నట్లు తహసీల్దార్ భువనేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు యువత కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఫారం 6ను నింపి బూత్‌స్థాయి అధికారికి ఇవ్వాలని చెప్పారు. రెండు రోజుల పాటు బీఎల్‌ఓలు వారి పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా, మీ సేవ ద్వారా కూడా ఓటరుగా నమోదు చేసుకునే వీలుందని వెల్లడించారు.

నేడు, రేపు స్పెషల్ క్యాంపెయిన్

అనంతగిరి: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో ఓటరు జాబితాల్లో పేర్ల నమోదు, తొలగించటం, మార్పు చేర్పుల గురించి స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా బీఎల్‌ఓలు ప్రజల నుంచి ఫారం 6,7,8 స్వీకరిస్తారని పేర్కొన్నారు. జనవరి ఒకటి 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్తగా ఓటరు నమోదుకై ఫారం నంబర్ 6 నింపి, అందజేయాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలు తమ పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని వెల్లడించారు. కావున ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25న జాతీయ ఓటరు దినోత్సవం

బొంరాస్‌పేట: ఈ నెల 20, 21న బూతు స్థాయిలో బీఎల్‌ఓలతో ఓటరు జాబితాపై ప్రత్యేక క్యాంపెయిన్‌లు నిర్వహించనున్నట్లు తహసీల్దారు వెంకటేశ్ చెప్పారు. ఈ మేరకు స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధి 38 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు వారివారి కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు అందుబాటులో ఉండి, అర్హుల నుంచి ఫారం 6,7,8లను స్వీకరించాలని సూచించారు. అదే విధంగా ఏఎస్‌డీ (ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. ఈ నెల 6న జరిగిన ఓటరు సవరణ జాబితాకు అనుగుణంగా డబుల్, పర్మినెంట్ షిఫ్టెడ్, చనిపోయినవారి వివరాలను సేకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఈ నెల 25న జాతీయ ఓటరు దినాన్ని ఘనంగా నిర్వహించనున్నామని, అందులో భాగంగా అవగాహన ర్యాలీలు, మానవహారం నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

దళిత'బంధు'వులను ఆదుకోండి

- పార్టీలకు అతీతంగా పథకాన్ని అమలు చేయాలి
- సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప డిమాండ్



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యాలాల: దళితబంధు పథకానికి దరఖాస్తు చేసుకొని, ప్రొసిడింగ్స్, ఐడీలు పొందిన అర్హులకు.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి, దళితుల అభ్యున్నతికి పాటు పడాలని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదు నెలల క్రితం దళితబంధు పథకానికి అధిక సంఖ్యలో అర్హులు అర్జీ చేసుకున్నారని, ప్రొసీడింగ్స్ సైతం వచ్చాయన్నారు. కానీ.. నిధులు విడుదలయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో బ్రేక్ పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధును పార్టీలకు అతీతంగా అమలు చేయాలని కోరారు. అంతే కాకుండా.. ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం పథకానికి సంబంధించి విధివిధానాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మెట్లి కృష్ణ, రమేష్, నర్సింహులు, శ్రీనివాస్, మల్లప్ప, మహేశ్, లాలప్ప, సామెల్ తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతికి కేంద్రం తోడ్పాటు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బ్యాంకు అధికారులు తదితరులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికై బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు కొత్తబలిజ రాజు, ఎస్‌బీఐ మేనేజర్ వినోద్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం పీరంపల్లి గ్రామంలో వికసిత్ భారత్ క్యాలెండర్‌లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. బ్యాంకుల ద్వారా నిరుద్యోగులకు ముద్ర, మహిళ సంఘాలకు పొదుపు రుణాలు, బీమా వంటి ఎన్నో సౌకర్యాలను కేంద్రం అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ కాత్రావత్ రాజు, బ్యాంకు సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై అవగాహన

కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న వైద్య సంబంధిత పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారులు సూచించారు. శుక్రవారం చౌడాపూర్ మండలం కొత్తపల్లి తండా, పుర్సంపల్లి గ్రామాల్లో నిర్వహించిన వికసిత్ భారత్ అవగాహనలో కేంద్ర సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పుర్సంపల్లి సర్పంచ్ వెంకటయ్య, కొత్తపల్లితండా సర్పంచ్ హుమ్లానాయక్, ఎంపీటీసీ బ్రహ్మానంద రెడ్డి, ఎంపీహెచ్‌ఓ రాములు, కార్యదర్శులు గుర్నాథ్ రెడ్డి, నవీన్ కుమార్, వైద్య సిబ్బంది పుష్పలత, ఇందిర, ఉపాధిహామీ సిబ్బంది అశ్విని నాయక్, ఆశ కార్యకర్తలు రాజేశ్వరి, నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షితలు



అక్షితలను పంపిణీ చేస్తున్న రామభక్తులు

దోమ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను రామ భక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. శుక్రవారం దోమ మండలం పాలేపల్లి గ్రామంలో తొలుత రాములోరి అక్షితలను ఆంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పంచి పెట్టి మాట్లాడారు. ఈ నెల 22న అయోధ్యలో జరగనున్న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ హిందూ సమాజానికి గొప్ప పర్వదినమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యశోద, గ్రామస్తులు సత్యనారాయణరెడ్డి, తిరుపతయ్య, నర్సింహులు, ప్రతాప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కలిసి పనిచేస్తే.. సమస్యలు ఉండవు

- ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులకు నిధులు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

బంట్వారం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే పల్లెల్లో అసలు సమస్యలే ఉండవని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ ఎమ్మెల్యే, సభాపతి జి.ప్రసాద్‌కుమార్ సహకారంతో మండలంలో అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకు వస్తానని ఎంపీపీ పేర్కొన్నారు. గ్రామాల్లో తొలుత అత్యవసరమైన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందులో భాగంగా పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టి, నీరు వృథా కాకుండా చూడాలని ఎంపీపీ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు.

రోడ్ల దుస్థితి పట్టని అధికారులు

రొంపల్లి–ఓగులాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉందని, ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా సభలకు ఏఈ స్థాయి అధికారి కూడా రావటం లేదని మండిపడ్డారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలను సభలో చదివి వినిపించారు. అనంతరం మోడల్ స్కూల్ విద్యార్థులు తాండూరు డిపో బస్సు వేళల మార్పుపై ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. ఉదయం పూట పాఠశాల సమయానికి బస్సు నడిపించాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష, టీపీసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తౌఫిక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ సుశీల్‌కుమార్ షిండే, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఏఈ వేణుమాధవ్, ఎంఈఓ చంద్రప్ప, ఏఓ సంధ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు సహకరించండి



పన్ను వసూలు చేస్తున్న అధికారులు

యాలాల: ఇంటి పన్ను వసూలు విషయంలో ప్రజలు అధికారులకు సహకరించాలని ఎంపీఓ యాదయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధి రాఘవపూర్ గ్రామంలో ఇంటి పన్ను వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు అమర్ తదితరులు ఉన్నారు.

బహుజన రాజ్యాధికారమే లక్ష్యం



శ్రీశైలానికి నియామక పత్రం అందజేస్తున్న దయానందరావు, విజయ ఆర్య

షాబాద్: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ ఆర్య పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కర్రె శ్రీశైలాన్ని నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు నడుచుకోవాలన్నారు. బహుజన రాజ్యంతోనే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే పోరాటం విస్తృతం చేయాలన్నారు. బహుజనులందరూ కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, రాజమహేంద్రవర్మ, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్, సతీష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల స్వచ్ఛ మందిర్



స్వచ్ఛ మందిర్‌లో పాల్గొన్న నాయకులు

పరిగి: రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ స్వచ్ఛ మందిర్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో శుక్రవారం పట్టణ కేంద్రంలోని 10వ వార్డులో శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయంలో బీజేపీ శ్రేణులు స్వచ్ఛతకు శ్రీకారం చుట్టారు. గుడిని శుభ్ర పరచడంతో పాటు పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. ఇందులో ఆ పార్టీ నాయకులు శ్రీనివాస్, బాలకృష్ణ, పెంటయ్యగుప్తా, ఆంజనేయులు, రాంచెంద్రయ్య

ఘనంగా బోనాలు

కొడంగల్ రూరల్: మండల పరిధి టేకుల్‌కోడ్‌లో బోనాల పండుగ శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామ దేవతలకు భక్తులు భక్తిశ్రద్ధలతో బోనమెత్తారు. ఊరేగింపుగా వెళ్లి దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పాడి రైతులకు అవగాహన

కొందుర్గు: మండలంలోని తిరుమని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం హెరిటేజ్ సంస్థ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెరిటేజ్ జోనల్ హెడ్ సత్యనారాయణ హాజరై మాట్లాడారు. హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ అందిస్తున్న రైతు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల కోసం పంపిణీ చేస్తున్న ధాణను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెరిటేజ్ సంస్థ కల్పిస్తున్న రూ.2లక్షల ఉచిత బీమా సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ ప్రతినిధులు సర్వోత్తమ రెడ్డి, వెంకటేశం, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి మదారం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆటలు ఆడటం వలన రెండు ప్రాంతాల మధ్య సత్సంబంధాలు పెరుగుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఆటల్లో రాణించడం వలన ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు.

యాసంగిలోనూ వరి సాగుకే మొగ్గు

ముమ్మరంగా కొనసాగుతున్న నాట్లు



గట్టెపల్లి గ్రామ సమీపంలో ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

ధారూరు: ఆశాజనకంగా మద్దతు ధర, పుష్కలంగా నీటి వనరులు ఉండటంతో రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. కోట్‌పల్లి జలాశయంతో పాటు అధికంగా బోరు బావులు, చెరువులు, కుంటలు ఉండటంతో ప్రస్తుత సీజన్‌లో యాసంగిలో ఎక్కువగా వరి, దాంతో పాటే వేరుశనగ పండించేందుకు ఆ దిశగా కర్షకులు ముందుకు సాగుతున్నారు. విపణిలో వరి దొడ్డు రకం క్వింటాల్‌కు రూ.2,200, సన్న రకానికి రూ.3 వేల వరకు ధర పలకడంతో వరివైపే మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కూలీల కొరత వేధిస్తున్నా.. రోజుకు రూ.500 నుంచి 750 వరకు చెల్లించి దూర ప్రాంతాల నుంచి రైతు కూలీలను తీసుకువస్తున్నారు. గత వానాకాలంలో సాధారణ వర్షాపాతం కన్నా.. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉండటం వలన పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటలు 60 శాతం మేర దెబ్బతిని, రైతులను దెబ్బతీశాయి. దీంతో వీటితో లాభం లేదనుకున్న రైతులు.. వరి సాగు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వరినాట్లు 75 శాతం పూర్తయ్యాయని, ఈ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగవనున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రజా సమస్యలపై నిలదీత

ఆద్యంతం వాడీవేడిగా శంకర్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం వాడివేడీగా జరిగింది. మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో, నీటి పారుదల శాఖ సహకరించకపోవడంతో పూర్తి స్థాయి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని సభ్యులు సభదృష్టికి తెచ్చారు. ఇంద్రారెడ్డి నగర్, మాసానిగూడ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు సభ్యులు సభలో వాపోయారు. ఈ విషయంలో అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని సర్పంచ్ రవీందర్‌గౌడ్, రాములు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని, విద్యుత్ వోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని పలు మార్లు అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని సర్పంచ్‌లు ఏనుగు నర్సింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మోకిల పంచాయతీ కార్యదర్శి సస్పెండ్ అయిన విషయాన్ని తనకు కానీ, సర్పంచ్‌కు కానీ ఎందుకు చెప్పలేదని ఎంపీవో గీతను ప్రశ్నించారు. నీటి పారుదల శాఖ అధికారులు లంచం తీసుకుంటూ చెరువు, కాలువల్లో పైపులు వేయిస్తున్నారని, వాగులకు సంబంధించిన భూముల్లో ప్రహరీల నిర్మాణానికి సహకరిస్తున్నారని ప్రొద్దుటూరు సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి ఆరోపించారు. దాతల సహకారంతో పెద్దటూరు పెద్ద చెరువు కాలువను సుమారు రూ.60లక్షలతో మరమ్మతులు చేయిస్తే, అక్రమ నిర్మాణాలకు అధికారులు సహరించడం ఎంటని ప్రశ్నించారు. జనవాడ గ్రామ రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డుగా ఉన్న డ్వాక్రా భవనాన్ని కూల్చేసేందుకు అధికారులు అనుమతులు ఇవ్వాలని, కొత్త భవనాన్ని సొంత నిధులతో నిర్మిస్తున్నట్లు సర్పంచ్ లలిత అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి జెడ్పీటీసీ గోవిందమ్మ, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, తహసీల్దార్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.